


కథ 1993

6

# ఇంధనం

మహేంద్ర

అసిస్టెంటు స్టేషన్ మాస్టరు దక్షిణామూర్తి బుకింగ్ ఆఫీస్ నుంచి బయటకు వచ్చి ప్లాట్‌ఫారం అంచున నిలబడి ఆ చివరి నుంచి ఆ చివరిదాకా తేరిపారజూశాడు.

ఉదయం తొమ్మిది గంటలకు రావలసిన ప్యాసింజరు బండి పదకొండు గంటలవుతున్నా ఇంకారాలేదు. బొగ్గుకు కరువొచ్చిపడి రైళ్లన్నీ తరచూ ఆలస్యంగా నడుస్తున్నాయి. ఉదయం బండికి మాములుగా టవును కెళ్లే ఉద్యోగులు మూడు కిలోమీటర్లు నడిచి చెక్‌పోస్టు దగ్గర బస్సులు పట్టుకుని వెళ్లిపోయారు. క్యారియర్లనిండుకూ టిఫెన్లు ఉన్న స్టూడెంట్లు చెట్లమాటున జేరి చీట్లాట మొదలుబెట్టుకున్నారు. పోర్టర్లు, పాయింట్స్‌మెను కూడా కనిపించడంలేదు. మధ్యాహ్నం బండికి టవునుకు కట్టెలు తీసుకుని వెళ్లేవాళ్లు రావడానికి ఇంకా కనీసం గంటసేపు పడుతుంది. స్టేషను మాస్టరు ఒకడు మాత్రం బుకింగ్ ఆఫీస్ ముందు అనాథలా తిరుగుతున్నాడు.

ఎత్తైన కొండల వరసల మధ్యలో ఇరుకుగా వున్న మైదానం మీదుగా రైలు దారి ఉత్తరం దక్షిణాలుగా వ్యాపించి ఉంది. కొండల నావరించి ఉన్న అడవులన్నీ ఎండలకు కృశించి నల్లబడ్డాయి. మంచి మధ్యాహ్నామవుతున్న వేళ రైలుపట్టాలు సూర్యుడనే కొలిమిలో వ్రేల్చబడుతున్నట్టుగా కాలిపోతున్నాయి. పట్టాల క్రింద గులకరాళ్లు నిప్పుకణికల్లా మండుతున్నాయి. గ్యాంగ్‌మేన్ సమ్మెటతో ట్రాక్‌ను సరిజేస్తూ కొట్టుకొంటూపోతున్న శబ్దం లోయంతా ఒకే గుండె చప్పుడులా వినిపిస్తోంది.

దక్షిణామూర్తి ఆరోజు ఇంతవరకూ పచ్చి మంచినీళ్లు కూడా ముట్టలేదు. భార్య అముదవల్లి ఏడు గంటలకు టిఫిన్ చేసే ప్రయత్నాలేవీ చేయకపోవడంతో దక్షిణామూర్తి భార్యమీద అలిగి కనీసం తొమ్మిది గంటల బండి వెళ్లేంతవరకూ ఏమీ తిననని పంతంబట్టి మరీ స్టేషనుకు వచ్చేశాడు. టైమ్ పదకొండు దాటుతున్నా బండి ఇంతవరకూ కనీసం బ్లాక్ కాలేదు. మామూలు రోజుల్లో అయితే దక్షిణామూర్తికి బండ్ల రాకపోకల పట్ల ఏమాత్రం ఆసక్తి ఉండదు. కానీ తాను టవున్నుంచి ఇంటికి గ్యాస్ సిలెండర్ తెప్పించడానికి భార్య దగ్గర నుంచి పొందిన ఆఖరి గడువు తేదీ నేటితో ముగుస్తున్నది. సాయంత్రానికి సిలెండర్ రాని పక్షంలో ఈరోజుకిక పూర్తి లంఖణమే. అప్పటికీ అముదవల్లి వారం రోజుల ముందు నుంచీ ఈ విషయాన్ని పదేపదే గుర్తు చేస్తూనే ఉంది. పాయింట్స్‌మేన్ గంగయ్య కూడా రెండు మూడు రోజులుగా అదే పనిమీద ఉన్నాడు. పట్టణం నుంచి ఈ మారుమూల స్టేషనుకు గ్యాస్ సిలెండర్‌ను తీసుకొచ్చే గహనమైన పనిని అలవాటుగా జేస్తున్న అరుణాచలం హఠాత్తుగా మాయమై మళ్లీ నిన్న సాయంత్రానికి ప్రత్యక్షమయ్యాడు. ఆ వచ్చినవాడు వడగాలికి ఎండుటాకులా కొట్టుకువచ్చాడు. పైకి లేస్తే మళ్లీ దభాలున నేలమీదకు జారిపడిపోయేటంత నీరసంగా వచ్చాడు. టీలు త్రాగించి, బీడీలు కొనిచ్చి, కావలసినంత సాంబ్రాణి ధూపం వేసి అతణ్ణి కర్తవ్యోన్ముఖుని చేయడానికి తెల్లవారి ఎనిమిది గంటల దాకా సరిపోయింది.

రైలు లేటు అవడమే సాకుగా గంగయ్య, అరుణాచలం- ఇద్దరూ అప్పట్నుంచే ఎక్కడికి వెళ్లారో తెలియడం లేదు. బహుశా ఏ నాష్టాలు దట్టించడం కోసమో చెక్‌పోస్టు దగ్గరకు పోయుంటారు. బండి వచ్చే లోపల సకాలానికి తిరిగి వద్దామన్న స్పృహ ఇద్దరికీ ఉండదు. కడుపునిండా తిని కాళ్లు బార్లా చాపేస్తారు. ఆలోచించిన

కొద్దీ దక్షిణామూర్తి ఆకలితోనూ, నీరసంతోనూ, కోపం తోనూ వణికిపోయాడు. మళ్లీ నిగ్రహించుకొని బుకింగ్ ఆఫీసులో కొచ్చి విశాలంగా ఉన్న కొయ్య కుర్చీకి ఒక మూలగా కూలబడ్డాడు. ఎత్తైన పైకప్పు మీద నుంచి పాత ఫ్యాను పెద్దగా శబ్దం జేస్తూ తిరుగుతూ ఉంది.

అటు నశించిపోతున్న అడవులకు ఆశ్రయం ఇస్తున్న కొండల వరుసా- ఇటు నీటి ఆదరువు తక్కువై నామమాత్రంగా మిగిలిపోతున్న పొలాలూ- ఎక్కడో నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఈ స్టేషను పేరే కలిగిన ఒక చిన్న పేట- మూడు కిలోమీటర్లు అటూ ఇటూగా ఉన్న అవుటర్ సిగ్నల్స్ మధ్యలో ఉన్న ఈ స్టేషనుగా పిలువబడుతున్న ప్రాంతానికి తాను అసిస్టెంటు స్టేషను మాస్టరుననుకోవడం ఉత్తుత్తి మర్యాదగా దక్షిణామూర్తి తొందరలోనే గ్రహించగలిగాడు. టవునులో పుట్టి, వేళకు సరిగా బడికి వెళ్లి, పాఠాలు శ్రద్ధగా చదువుకుని, సక్రమంగా కాలేజి కూడా ముగించుకుని మద్రాసులో పెండ్లాడి చివరికి ఈ అడవి స్టేషను పాలయిన తన 'జాలికత' అతడిని అప్పుడప్పుడు తీవ్రమైన అసంతృప్తికీ, వేదనకూ గురిజేస్తూ ఉంటుంది. ఇంటా బయటా కూడా తన ప్రయోజకత్వం అంతంత మాత్రమైన గుర్తింపు కలిగి, చివరికి తన అస్తిత్వానికి కూడా ప్రమాదం కల్గించే దారుణ పరిస్థితి ఒకటి కొంత కాలంగా అతడిని తీవ్రమైన వ్యధకు గురిజేస్తూ ఉంది.

కడుపు చల్లగా ఉండే పక్షంలో, ఏ బండి అయినా వేళకు వచ్చినా, రాకపోయినా, ఏ పాయింట్స్‌మెన్ ఎక్కడ అఘోరించినా, ఎవరు టిక్కెట్లు కొన్నా, ఎవరు ఏ అడవిలో తగులబడినా పట్టించుకోకుండా ఉండడానికి దక్షిణామూర్తి అలవాటు పడ్డాడు. అయితే కడుపు కాలుతున్న ప్రస్తుత విపత్కర పరిస్థితిలో అతడికి తన ఉద్యోగం అనబడే దీర్ఘకాలిక ఆత్మవంచనా పోరాటంలోని ఈతి బాధలన్నీ ఉక్కిరిబిక్కిరిగా గుర్తుకొస్తున్నాయి.

పురాతన శిలాశాసనం లాంటి బండ్ల రాకపోకల పట్టీ ఒకటి వెయిటింగు రూములో దుమ్ముకొట్టుకొని మిగిలి ఉంది. అయితే వేళల విషయంలో బండ్లన్నీ ఎప్పుడో స్వాతంత్ర్యం ప్రకటించుకుని కేవలం తమ ఇష్టానుసారంగా నడుస్తున్నాయి. ఉదయం ఎనిమిది గంటలకు రావల్సిన ప్యాసింజరు రైలు బాటల ప్రక్కలో రైతులు సద్దులు తాగేవేళకు కనిపిస్తూ సద్ది బండిగా ప్రసిద్ధికెక్కింది. మధ్యాహ్నం పన్నెండు గంటల పన్నెండు నిమిషాలకు వచ్చి చేరే పన్నెండు గంటల పద్దెనిమిది నిమిషాలకు బయలుదేరాల్సిన బండి మధ్యాహ్నం వొకటి-మూడు గంటల మధ్య నడుస్తూ పట్టణానికి వంటచెరకు చేరవేయడం వల్ల కట్టెల బండిగా మిగిలిపోయింది. తపాలా సంచులు మోస్తున్న తరుణోపాయంతో 92 డవున్ బండి పోస్టు బండిగా మంచి పేరు కొట్టేసినా- రాత్రించరి అయిన రాత్రి తొమ్మిదిగంటల బండికి దొంగల బండనే చెడ్డపేరు రానే వచ్చింది. ప్రక్కనున్న స్టేషన్ల నుంచి అవుట్ అయ్యాక కూడా రైళ్లు అంచనా టైముకు రాకపోవడంతో దక్షిణామూర్తికి కాలమూ-దూరమూ వంటి ప్రాథమిక లెక్కల సూత్రాల పట్ల కూడా నమ్మకం పోయింది. ఇప్పుడతనికి రైళ్లు పూర్తిగా ఆగిపోయాక తాను పచ్చజెండా ఊపుతున్నట్టు, రైలు పోయిన తర్వాత కూడా పచ్చ జెండా ఊపుతున్నట్టు ఒక ఉన్మత్త మానసిక పరిస్థితి ఏర్పడింది. రైళ్లు తమంత తాము తమ ఇష్టానుసారం నడుస్తుండగా- తాము సిగ్నల్స్ ఇస్తున్నామనుకోవడం కేవలం తన భ్రమగానే కనిపిస్తోంది.

వేళలు పాటించడంలో స్టేషనులో పనిచేస్తున్న పాయింట్సుమెన్, పోర్టర్లు రైళ్లను మించిపోయారు. వారిలో కొంతమందికి దగ్గరలో చేలున్నాయి. ఒకరిద్దరికి ఆవులు, మేకలూ ఉన్నాయి. ఒక వ్యక్తి చెక్‌పోస్టు దగ్గర ఒక చిల్లర అంగడి నడుపుతున్నాడు. వారందరికీ ఉద్యోగం కేవలం ఉపవృత్తిగా ఉపయోగపడుతోంది. ఏ ఇతర వృత్తీ లేకపోయినా స్టేషన్ అనబడే రాజ్యాన్ని ఇష్టకామ్యార్థ సిద్యర్థం నడిపిస్తూ, తన మాటే వేదంగా, తాను పెట్టిందే చట్టంగా, ఈ భూమికి క్షేత్ర పాలకుడిగా, ఈ వలస రాజ్యానికి అనధికార వైస్రాయిగా వ్యవహరిస్తున్న వ్యక్తి పాయింట్స్‌మన్ గంగయ్య. స్టేషను పైన తన మాస్టరీని కాపాడుకోవడం కోసం దక్షిణామూర్తి గంగయ్యతో ప్రతిదినం సంఘర్షించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ఉద్యోగంలో చేరి స్టేషను కొస్తూనే తన విధి నియమాలను తు.చ. తప్పకుండా నిర్వర్తించడానికి పూనుకున్నాడు దక్షిణామూర్తి. అందులో మొదటి సూత్రం రైలునెక్కుతున్న ప్రతి మనిషికీ తగిన టిక్కెట్టు ఉండాలనుకోవడం. టిక్కెట్టు లేని ప్రయాణికుల్ని పట్టుకోవడం కోసం అతడు తనవల్ల వీలయినన్ని చర్యలు తీసుకున్నాడు. ప్లాట్‌ఫారం వైపు అక్కడక్కడ పడిపోయిన కంచెను బాగు చేయించాడు. రైళ్లలో తిరిగే టికెట్ కలెక్టర్లను అప్రమత్తం చేశాడు. మెరుపుదాడి చేసే స్క్వాడ్లను రంగంలోకి దించడానికి ప్రయత్నించాడు. చుట్టూ స్టేషనుకున్న అన్ని దారులనూ అష్టదిగ్బంధనం చేశాడు.

అయితే గంగయ్య నిలబడ్డ ద్వారం దగ్గర నుంచి టిక్కెట్టు లేని ప్రయాణీకులకందరికీ రోజూ క్రమం తప్ప

కుండా విడుదల లభించింది. 'టిక్కెట్లు లేని ప్రయాణం చట్టరీత్యా నేరం-ప్రభుత్వానికి నష్టం' అని దక్షిణామూర్తి గంగయ్యకు చెప్పి చూశాడు. ప్రయాణీకులందరూ టికెట్లు కొన్న పక్షంలో- ప్రభుత్వానికి మళ్లీ మళ్లీ టికెట్లు అచ్చువేసే అదనపు ఖర్చు పెరుగుతుందని అతి వినయంగా తన ధూర్త లక్షణాన్ని బయటపెట్టాడు గంగయ్య. అతడి కళ్లలో కనిపించే గడుసుదనమూ, గుబురు మీసాల దాటున దాగే 'మిశ్చువస్' నవ్వు- అతడు తనతో పరాచకాలు ఆడుతున్నట్టు గ్రహించాడు దక్షిణామూర్తి. అసలందరూ టికెట్లు కొనేపక్షంలో టీసీలకు, స్క్వాడ్ మెంబర్లకు ఉద్యోగాలు వృథా అనీ, తమలో మరికొందరి సేవలు కూడా ప్రభుత్వానికి అనవసరమనీ గంగయ్య వాదించాడు. వెరశి కొంతమంది మీద కొన్నిరోజులు చర్య తీసుకోవడంలో దక్షిణామూర్తి గెలిచినా, చాలారోజులు గంగయ్య ఆధిపత్యమే చెల్లుబాటు అవుతోంది. చెడ్డ పని చేయటం వల్ల సాతానుకు మల్లే గంగయ్యకు ప్రీతి కల్గేట్టు ఉందని దక్షిణామూర్తి పలుమార్లు తిట్టుకున్నాడు. అంతేగాక స్టేషన్లో జరిగే ప్రతి చట్టవ్యతిరేకమయిన పనికీ గంగయ్య సూత్రధారుడుగా వ్యవహరిస్తూ, వెయిటింగు రూంలో చేరే అలగా జనానికి రక్షణగా, వారి అండర్‌గ్రవుండ్ రాజ్యానికి తిరుగులేని మాఫియా కింగులా తయారౌతున్నాడేమోనన్న భయం ఒకటి అతడిని పట్టుకుంది.

రైళ్లు తరచూ ఆలస్యంగా వస్తుండడం వల్ల ఇబ్బందిపడే విద్యార్థులకు చాటుమాటుగా చీట్లాడుకోవడానికి వసతి కల్పించడం- స్టేషను చివరనున్న పంపు షెడ్డును అరుణాచలం అనే అనాథకు అద్దెకిచ్చి, దాన్ని కాస్తా కాజేసి అతనికి వాచ్‌మెన్ అనే పేరు పులమడం- స్టేషనుకు చెందిన బావి నుంచి సమీపంలోని రైతులకు చాటుమాటుగా నీరు వదలడం దగ్గర్నుంచీ గంగయ్య చెయిదాలు చిలవలూ, పలవలూ అయ్యాయి. ఎండల కాలం ముదిరేకొద్దీ సేలం, కాట్పాడి నుంచీ వచ్చే అరవ కూలీలకందరికీ వెయిటింగు రూంలో సీజనల్ వసతి సౌకర్యం కల్పించడం గంగయ్య ప్రారంభించిందే. వారు ప్రతిరోజూ చట్ట వ్యతిరేకంగా అడవిలో చెట్లు కొట్టి రైల్లో టవునుకెళ్లి అమ్ముకొంటూ ఉండగా, గంగయ్య వారి దగ్గర్నుంచి మోపుకు ఇంతని వసూలు చేసి అందులో కొంత భాగం టీసీలకు, స్క్వాడ్ మెంబర్లకు ఇచ్చి వారిని రక్షిస్తున్నానని చెప్పుకుంటున్నాడు. అడపా, దడపా వారిలోని ఆడవాళ్లు చేస్తున్న చీకటి వ్యాపారానికి కూడా గంగయ్య మద్దతు ఉండినట్టే ఉంటుంది. అతడు పోయే సరాగాలూ, సరసాలు అన్నీ ఇన్నీ కావు. అరవై ఏళ్ల దగ్గర పడుతున్నవాడికి ముప్పై ఏండ్ల దానితో సరసాలేమిటి? దారుణం, దారుణం- దక్షిణామూర్తికి స్టేషనంతా ఒక భూతం ఆవహించింది- అది 'గంగయ్య అనే భూతం' అనిపించసాగింది.

గంగయ్య అనే చట్ట వ్యతిరేక భూతాన్ని స్టేషనుకు మాత్రం పరిమితంజేసి, తన ఇంట్లోనైనా తాను ప్రశాంతంగా ఉండాలనుకున్న దక్షిణామూర్తికి చివరకు అది కూడా అడియాసే అయింది. మద్రాసులో పుట్టి, మాంబళం మల్లెపూల బజార్లలో తిరిగిన తనను ఈ అడవి స్టేషను పాల్జేసిన పాపానికి అముదవల్లికి భర్తపై కలిగిన కోపం చివరకు గ్యాస్ సిలెండరు రూపంలో బ్రద్దలయింది. స్టేషన్నుంచి రోజూ టన్నుల కొద్దిగా వంట చెరకు మోపులు మోపులుగా టవునుకు సరఫరా అవుతోంది. రాజుగారు అనుకుంటే దెబ్బలకు కొదువలేనట్లు, స్టేషను మాస్టరు అనుకుంటే కట్టెలకు కొదువా? అయితే అముదవల్లికి కట్టెలపొయ్యి అంటించడం కూడా చేత కాదు. స్టేషనులోని షెడ్లనిండా రైల్వే బొగ్గు మూలుగుతోంది. అదే క్వార్టర్సులోని వాళ్ల కుంపట్లకన్నిటికీ బొగ్గును నిరాటంకంగా సరఫరా చేస్తున్నది. కానీ బొగ్గుల కుంపటి బొగ్గుపులుసు వాయువు- అముదవల్లికి ఎంత మాత్రం సహించదు. కిరసనాయిలు స్టవ్వుల వల్ల తన పుట్టింటి స్టీలు పళ్లాలు మసి అయిపోతాయి. వెరశి తాను వంట చేయడానికి గాస్‌స్టవ్వు ఒకటే శరణ్యమని తేల్చి చెప్పేసింది అముదవల్లి.

కట్టెల్ని అడవినుంచి ఇంటికి మోయడం సబబే. కాని ఇంటి నుంచి అడవికి మోయడం వృథా వ్యయ ప్రయాస. టవున్నుంచి గ్యాస్ సిలెండర్ ఈ స్టేషనుకు రావడానికి ప్రత్యేక ట్రక్ సౌకర్యం లేదు. లేక ప్రత్యేక హెలీకాప్టర్‌లో రావడానికి అదేమీ రాజకీయ నాయకుడో, విఐపీనో కాదు. మనుషులు ప్రయాణం చేసే రైళ్లలో, బస్సుల్లో సిలెండరు తేవడం చట్టరీత్యా నేరం. సాటి మనుషులకు ప్రాణపాయం. దక్షిణామూర్తికి సంకటం ఎదురయింది. సరిగ్గా ఆ సమయంలోనే గంగయ్య భూతంలా అరుణాచలం అనే అద్భుత దీపంతో దక్షిణామూర్తి ఇంట్లో ప్రవేశించాడు.

'చట్ట వ్యతిరేకమయిన పనులేమైనా ఉంటే చెప్పు,' అంది భూతం. అప్పుడెప్పింది అముదవల్లి. గంగయ్య అజ్ఞాపించాడు, అరుణాచలం ఆరంభించాడు. సిలెండరు ఒక గోతంలో మూటగా కట్టబడి నెల నెలా రైలులో రవాణా అవుతోంది. ఆ 'ఆపరేషన్ సిలెండరు' ప్రారంభమైనప్పటి నుంచీ- ఇల్లు జేరేదాకా దక్షిణామూర్తికి ఆ రోజంతా పీడకలలే. రైలు పెట్టెలో సిలెండరు పగిలినట్టు, ఆ మంటల్లో ప్రయాణీకులు కాలినట్టు, తన ఉద్యోగం ఊడినట్లు, తన కొంప కూలి

నట్లు- తలచుకుని తలచుకుని దక్షిణామూర్తికి ఆ రోజంతా క్షణమొక యుగంలా నడుస్తుంది. అయితే ఇది నెలకొకసారి తప్పని దుస్వప్నం. ఇది మొదలయిన నాటి నుంచీ గంగయ్య తన అధోజగత్ సామ్రాజ్యాన్ని మరింత భయరహితంగా పాలించడం మొదలుబెట్టాడు. గంగయ్య అతి వినయం, అవసరానికి అడగకుండానే సాయపడే తత్వం దక్షిణామూర్తిని కూడా అప్పుడప్పుడూ మభ్యపెట్టేది. అయితే అతనికి మాత్రమే ప్రత్యేకమైన తర్కం మాత్రం దక్షిణామూర్తికి ఎప్పుడూ పంటి కింద మెదిగేది కాదు.

ఎండలు ముదిరేకొద్దీ వ్యవసాయం పనులు తక్కువై కట్టెలమ్ముకోవడం కోసం జనం ఎక్కడెక్కడి నుంచో వచ్చి పడేవాళ్లు. వాగన్లు వాగన్లుగా కట్టెలు నరకబడి అడివంతా బీడు అయిపోసాగింది.

'అడవుల్ని నరకడం అవివేకం. పరిసరాలకు హాని కరం. అందువల్లే వర్షాలు సరిగా కురవడం లేద'ని అంటే- 'అసలు వానలు సక్రమంగా కురిసి సేద్యం పనులు దొరికితే మళ్లీ కూలీలు కట్టెలకని అడవికెందుకు బోతారు. కాబట్టి వానలు కురవకపోవడం వల్లే కూలీలు అడవుల్ని నరుకుతున్నార'ని గంగయ్య వాదం. గంగయ్య తనకు తాను తనదైన ఒక ప్రత్యేక తర్కాన్ని ఏర్పరచు కున్నట్టుగా కనిపిస్తుంది దక్షిణామూర్తికి. ఒక్కోసారి ఏదో అదృశ్యశక్తితో ఈ స్టేషనులోని జీవులన్నింటి చలనాల్నీ నియంత్రిస్తున్నట్టు భ్రాంతి కలిగేది. ఈ స్టేషను, ఈ అడవీ, అటూ ఇటూ పల్లెలూ- ఇవేవీ పూర్తిగా ప్రభుత్వపు అదుపులో లేవు. వీటినన్నింటినీ అదుపులో పెట్టగలిగే శక్తి గంగయ్యకు మాత్రం ఎట్లా ఉంది? అసలు గంగయ్యను అదుపు చేయగల మొనగాడే లేడా? దక్షిణామూర్తికి తీవ్రమైన నిర్వేదం కలగసాగింది.

అయితే చెట్లను కాల్చగల నిప్పు చెట్లలోనే పుట్టి నట్టు- గంగయ్యను అదుపు చేయగల వ్యక్తి అతడి రాజ్యంలోనే ఉన్నట్టు దక్షిణామూర్తి తొందరగానే కను క్కున్నాడు. అతడే అరుణాచలం. ఆలోచనలు గంగయ్య మీదనుంచి అరుణాచలం మీదకి, శరీరం నీరసంలో నుంచి సుషుప్తిలోకి ప్రవేశిస్తుండగా దక్షిణా మూర్తికి ఫోన్ కాల్ వినిపించింది. తెల్లవారి రావాల్సిన సద్దిబండి- కట్టెల బండి రూపంలో రాబోతున్నది. ట్రైన్ బ్లాక్ అయింది. ఇంకా గంగయ్య ఎక్కడ అఘోరిస్తు న్నట్టు? అతగాడు వచ్చేదెప్పుడు? సిగ్నల్స్ ఇచ్చేదెప్పుడు? తనను కూడా లెక్కబెట్టని అరుణాచలాన్ని ఆవాహన జేసి సిలెండరు తేవడానికి కర్తవ్యోన్ముఖుని చేసేదెప్పుడు? ఏఎస్ఎమ్ చరచరా బయటకు వచ్చాడు. ఎండ కూడా ఆసరికి నడినెత్తిమీద మొటమొటలాడుతుంది. తాను ఆర్డర్ జారీ చెయ్యకముందే గంగయ్య సిగ్నల్సు ఇచ్చేసి నార్త్ క్యాబిన్ కిటికీల నుంచీ కొండ పాదాల నుంచీ వస్తున్న కట్టెల వాళ్ల కదలికల్ని పసిగడుతున్నాడు.

గంగయ్య ముసలి గద్దలా నార్త్ క్యాబిన్ కిటికీ నుంచి లోయనంతా పరిశీలనగా చూస్తున్నాడు. వయసు పెరిగినా ఇంకా కళ్లజోడు వాడకపోవడం వల్ల అతడు కళ్లు మిటకరించుకుని మరీ చూడవలసి వస్తోంది. అతడు బీడీ పొగ వదలడానికే ఆయాస పడిపోతున్నాడు. అక్కడక్కడ పుంతల్లో బడి, పొలాల కటవల్లో కొందరు ఆడ, మగ అంతంతమాత్రం ఉన్న ఆచ్ఛాదనలతో డొక్కల్ని ఆర్చు కుంటూ, రొమ్ముల్ని ఎగరేసుకుంటూ ముక్కులో, నోటిలో వేడిగాలులు వదులుకుంటూ, చెమటలు కక్కు కుంటూ, భుజాల రెక్కల్ని రైలుచక్రాల్లా ఆకుల్లా తిప్పు కుంటూ వస్తున్నారు. కొత్తపల్లె నుంచి ఉ లింజపండ్లు తెచ్చి అమ్ముకునే ముసల్ది ఇంకా కనిపించడం లేదు. యనాదిపల్లె దారిగుండా వచ్చి టైమ్‌పాస్ బటానీలు, వేరుశెనక్కాయలూ అమ్ముకునే నూరుల్లా ఈరోజు కూడా వచ్చేట్టు లేడు. ఉదయం కనక ప్యాసింజరు సకాలంలో వచ్చి ఉన్నట్లయితే గంగయ్య ఆ బండిలో టిఫెను అమ్ముకునే బాబుగాడినో, జాన్ గాడినో అటకాయించి ఒకటో రెండో దోసెలో, ఇడ్లీలో తిని ఉండేవాడు. రెండు మూడురోజులుగా స్టేషనులో టీ అమ్ము కునే ఖాదర్ బాషా కూడా కనిపించడంలేదు. కడుపులోని మంటకు, మంటే ఔషదంలా మళ్లీ బీడీ ముట్టించాడు గంగయ్య. ట్రాక్‌మీద పోతున్న గ్యాంగ్ మన్ తన మధ్యాహ్నపూర్వ కార్యక్రమానికి విరామం ఇచ్చి కొళాయి దగ్గర చేతులు , కాళ్లు కడుక్కుని, వేపచెట్టు క్రింద చేరి క్యారియర్ విప్పుకోసాగాడు. అతడి సత్తు క్యారియర్‌లోని సంగటి ఎండవేడికి ఇంకా సెగలు పొగలుగా ఉంది. ఆ సంగటికి- ఆ పచ్చడికి అమృతమే గదా- అను కుంటూ క్యాబిన్ మెట్లు దిగాడు గంగయ్య. ఆ మాత్రం తిండికే అతడి నోట్లో నీరూరాయి.

రత్నమ్మ అప్పటికే తాను తెచ్చిన కట్టెల్ని టూల్ బాక్సుకు ఆనించేసి, ప్రక్కనున్న షెడ్డులో ఉదయం తాను తెచ్చిపెట్టుకున్న సద్దిని కలిపి గటగటా తాగేసి గబగబా త్రేన్చేసింది. కడుపు చల్లబడటంతోటే వడగాలి సైతం ఆమె ముఖంమీద చల్లగా సోకి ముంగురుల్ని సరిజేసింది. గంగయ్యను చూస్తూనే, ''ఇప్పటికి ఈ గొంతులో ఈ నీళ్లు పోసుకున్నా,'' పళ్లు ఇకిలిస్తూ వెంట పడింది రత్నమ్మ.

''నువ్వు ఈ నీళ్లు పోసుకునేదీ- ఆ నీళ్లు పోసు కునేదీ నాకు తప్పించి ఎవరికీ అక్కరలేదు. అట్ల నీ మొగుడికీ అక్కర్లా, ఇట్లా ఊర్లో మీ అమ్మగారికీ

అక్కర్లా,'' నవ్వుతో ముడతలు బడ్డ మొగంతో కన్ను గీటి నట్టుగా అన్నాడు గంగయ్య. కట్టెలవాళ్లు ఒకరొకరుగా అక్కడి చేరుకొంటున్నారు.

''ఏం సామీ బండి లేటంట గదా. ఇప్పుడొచ్చేది సద్ది బండేనంట గదా,'' రంగయ్య అడిగాడు.

''నువ్వు నిన్న ఎందుకు అడివికి రాలే. ఒంట్లో సత్తువ లేకపోబట్టే కదా. అట్ల ఆ బండికీ ఎలబారను బొగ్గు సాల్లేదు. ఆడెక్కడో గెన్లో స్ట్రయికు జేస్తా ఉన్నా రంట. అందుగ్గాను బొగ్గు సప్లై కాలేదంట. అందుకూ బండ్లు లేటుగా నడవడం,'' గంగయ్య తరపున తానే సమాధానమిచ్చేసి అంతేగదా అన్నట్టు చూశాడు చిన్నస్వామి.

''బొగ్గు లేకపోతే ఏమి? ఇంక ఈ సెక్సన్లో కూడా అన్నీ ఆయిల్ ఇంజన్లు వచ్చేస్తాయంట గదా. దాని స్పీడు వీటికి రాదు,'' అన్నాడు రంగయ్య.

''హోర్నీ! ఆడికి నువ్వే డిపార్టుమెంటులో పన్జేసేట్టు మాట్టాడేస్తా ఉండావు. ఆడికి ఆయిలు మాత్రం మీ జలదాట్లో బురదనీళ్లు మాదిరి దొరకతా వుండాదను కుంటా వుండావా? వాడు కువైట్లో దానికీ ఎసరుబెట్టేసి వుంటాడు. అది గనుక నిల్సిపోతే రైళ్లే కాదు బస్సులు, లారీలు, ట్రక్కులు సమస్తం ఏడవాడ నిల్సి పోవా ల్సిందే,'' అన్నాడు గంగయ్య.

''అది లేకపోతే దాని అబ్బ అట్టాడిది. కరెంటు రైళ్ల సంగతి నాకు తెల్దనుకుంటా వుండావా?'' బదులు చెప్తుతూ గంగయ్య ముఖం చూడలేనట్టు కళ్లు మూసు కుని బీడీ ముట్టించుకున్నాడు చిన్నసామి.

చుట్టూ చేరిన కట్టెలవాళ్లు గంగయ్య- చిన్న సాముల సంవాదాన్ని చోద్యంగా చూడసాగారు. పరువు కాపాడుకోవాల్సిన సమయంలో తన వాదానికి తనే ప్రతి వాదాన్ని ఆశ్రయించక తప్పింది కాదు గంగయ్యకు.

''ఇంతా జేస్తే ఆ ఎఎస్ఎమ్ చెప్పేది నిజంగా ఉండాది. మీరంతా ఈ చెట్లు ఈరకంగా నరుక్కుంటూ పోతే ఇప్పుడు కురిసే ఈ వానలు కూడా కురవ్వు. నీళ్లు సాలక భూములన్నీ బీళ్లు పెట్టుకోవాల్సిందే. కరెంటు సక్రమంగా రాక రైతులిప్పుడే ఆయిల్ ఇంజన్ల కోసం పడిగాపులు బడతా వుండారు. మబ్బయితే బట్టలు మలక్క సీకట్లో బడి అగోరిస్తా వుంటే, కరెంటు బండ్లు వస్తాయంట నీయమ్మ- యిట్ల బొగ్గు సాలక, అట్ల ఆయిలు రాక ఈ బస్సులూ, రైళ్లన్నీ నిల్చిపోయి వర్క్‌షాపుకు పోయి కండమైపోతే- వాటిని కాల్చను కట్టె పుల్ల లేక కడాకు మిమ్మల్నేసి కాల్చాల్సి వస్తుంది,'' గంగయ్య పేట్రేగిపోయాడు.

బండ్లు ఆలస్యంగా రావడానికీ, లేదా అసలు రాక పోవడానికీ ఏది అసలు కారణమో అర్థంకాక కూలీ లందరూ బీడీలు తాగుతూ, వక్కాకు నములుతూ ఆలో చనలో పడ్డారు.

అందర్లోకీ తొందరగా కోలుకొన్నది రత్నమ్మ. ''కట్టె లమ్మి మేమేదో మిద్దెలు, మేడలు కట్టేసినట్టు మాట్టా డతా వుండావు. నువ్వేమో మాంతమైన కష్టం పడిపోతా ఉన్నట్టు వగలుపోతా వుండావు. టీసీల కిస్తానసీ, వీడి కిస్తానసీ మోపుకు రూపాయి లెక్కన వసూలుజేసి మొత్తం నువ్వే మింగేస్తా ఉండావు గదా. అట్ల నువ్వు ఇస్తావుంటే ఆ రాజునాయుడు టీసీ మా మీదికి ఎందుకట్ల మోర ఎత్తుకుని వస్తా వుండాడంటావు జెప్పు. మేమన్నా కట్లు సీటు మీద ఏస్తా ఉండామా, దోవల్లో ఏస్తా ఉండామా! సీట్ల కింద ఏసినా ఈడ్చేస్తా ఉండాడు. కక్కసుల్లో ఏస్తా ఉండినా ఎదుక్కోని వచ్చేస్తా వుండాడు,'' అంటూ వగచ సాగింది.

''ఒళ్లు మీద గుడ్డ ఉండేదీ, లేందీ సూడకుండా మరుక్కు మరుక్కు పోయుంటావు. ఇదే సందని నాయుడు నీ యనకాల దూరేసుంటాడు. అయితే నాయుడికేమి బాగానే వుంటాడ్లే ...'' రత్నమ్మకేసి అను మానంగా చూస్తూ మాములు ధోరణిలో పడ్డాడు గంగయ్య.

''అయితే ఈ దినం స్క్వాడ్లు ఉండాదని అంటా వుండారు. దాని కత కరెట్టుగా చెప్పు,'' అన్నాడు రంగయ్య.

''కరక్టుగా చేప్పేదానికి నేనేమన్నా దేవుణ్ణా! అసలు సమ్మత్సరమంతా దొంగపన్లు జేస్తా ఒకనాటికన్నా ధర్మానికి తల వొంచకబోతే మళ్ల ఈ ప్రపంచకం నడిసేది ఎట్ల? అంత బయపడి సచ్చేటోళ్లు మీరు ఈ పనికి రానేకూడదు...'' గంగయ్య ప్లాట్‌ఫారం చివరనున్న రేకుల షెడ్డులోకి నడిచాడు.

ఫైనల్ రౌండులో వస్తాదుల్లా గంగయ్య, అరుణా చలం ఒకటి రెండు నిముషాలు వొకరినొకరు మౌనంగా చూసుకున్నారు. చివరకు గంగయ్య నోరు తెరిచాడు.

''ఈ ఏఎస్ఎమ్ వొకడు. నన్ను ఉన్నచోట ఉండ నివ్వటంలే. ఈ పొద్దు గనక ఆయన పని జూడనట్లైతే రాత్రికి నిద్రకూడ పోనీడు. నీకు ఒళ్లు బాగాలేని సంగతి తెలస్తానే ఉండాది. నువ్వెట్లా ఆ ఇనప సిలెండరు మొయ్యలేవు. నీకు తోడుగా రాగిమాను పెంట చెంగు లయ్యను పంపిస్తా ఉండాను. వాడు నూరు కిలోల బియ్యం మూటను అలాగ్గా ఎత్తి పారేసేవాడు. వానికీ పని లెక్కలోకిరాదు. సిలెండర్ని మూట్లో కుట్టి టీసీల క్కనపడకుండా దాచి పెట్టాల్సిందే నీ పని. వాళ్ల కంట్లో

పడితే మనకేమీ భయం లేదు. కొంపలేమీ అంటుకోవు గానీ ఏఎస్ఎమ్ భయపడి చస్తాడు. ఆ చెంగులయ్య వాడి ఆయిలు ఇంజనుకు ఆయిలు కోసమని వస్తా ఉండాడు. పది లీటర్ల క్యాను. దాన్ని మాత్రం నువ్వెత్తు కొస్తే చాలు. ఆ ఆయిలు ఇంజనుగానీ రన్ గాకపోతే వాడి పైరు మొత్తం మాడిపోతాది. సాయంత్రానికి ఈపని ముగించేయి. ఏఎస్ఎమ్ ఇచ్చే ముప్పై రూపాయలకు నేను ఇరవై ఎగేసి మొత్తం యాభైగా ఇచ్చేస్తా. నీ కష్టం పెట్టుకోన్లే..." అన్నాడు గంగయ్య.

అరుణాచలం ముఖంలో గబగబ రంగులు మారాయి. షెడ్డులో ఒక మూల గువ్వలా పడుండిన వాడు, నిక్కరు, చొక్కాయి వేసుకున్న దిష్టిబొమ్మలా తటాలున నిల్చున్నాడు. ఒక మూల వ్రేలాడుతున్న లెదర్ బ్యాగు నుంచీ దగ్గుమందు తీసి సగం బాటిలు గటగట త్రాగేశాడు.

ఇటూ అటూ మొకం తిప్పుకుంటూ, "తూత్తెరీ- ఎన్నయ్యా! అప్పటికి నేనేమో కాసంటేబడి సస్తా వుండేట్టు మాట్టాడతా వుండావు. ఈ అంబదు రూపాయిల్లో నాకొక నయాపైసా వొద్దు. నేను నీ పనిని ఊరికే చేసి పెట్టేస్తా. ఒక ఇన్నూరు రూపాయలు అప్పుగా ఇయ్యి సాలు. ఖండితంగా నెల్లోపల ఇచ్చేస్తా. ఇచ్చినావంటే వచ్చేవారం నేను వేలూరి ఆస్పత్రికి పోయి వచ్చేస్తాను. రాత్రి రాత్రి ఈ కడుపులో బాధ నన్ను బతకనీటం లేదు," అన్నాడు అరుణాచలం.

అవుటర్ సిగ్నల్ దాటుకుని గరండాల వంతెన మీద రైలు వస్తున్న శబ్దం- దాని వెంబడి రైలు కూతా విన్పించాయి. ప్లాట్‌ఫారంపై సంచలనం చెలరేగింది.

మండిపోతున్న పట్టాల మీద రైలు ఎండల బండిలా వచ్చి ఆగింది. అది వచ్చే ధాటికి ఎండన పొలాల్లో రేగిన వడగాలి ప్లాట్‌ఫారంపై సుడి తిరిగింది. సుడిగాలికి ఎండుటాకులూ, చిత్తుకాగితాలు పైకి లేచాయి. బొగ్గు ఇంజను వేడివేడిగా సెగలు కక్కు కుంటూ, గుప్పుమని నల్లటి పొగలు చిమ్ముకుంటూ వచ్చి ఆగింది. చెమటలు కక్కుకుంటున్నట్టుగా పెద్ద శబ్దంతో ఆవిరి వదిలింది. నల్లబట్టలతో, మురికి శరీ రాల్తో మండుతున్న కుంపటి ముందు ఇనుప విగ్రహాల్లా ఉన్న డ్రైవరు, ఫైర్‌మను క్రిందికి దిగి వాటర్ క్యాన్ల దగ్గరికి నడిచారు. తమ బొట్టల్లాంటి కడుపు నిండుకూ వాళ్లు నీళ్లు తాగి- మళ్లీ చెమటలు కక్కుకోవడం కోసం ఇంజను ఎక్కారు.

అరుణాచలంనూ, గంగయ్యనూ ప్లాట్‌ఫారం పైన చూడ్డంతోనే దక్షిణామూర్తికి ప్రాణం వచ్చినట్టయింది. రైలు ఆగకముందే శూలాలు ధరించిన వీరుల్లా దాని వెంటబడ్డ కట్టెల వాళ్లు- ఆగగానే లోనికి లంఘించారు. క్షణాలమీద వంటచెరుకు పెట్టెల్లో భర్తీ అయింది. బిచ్చగాళ్లకూ, కట్టెల వాళ్లకు అక్కడక్కడ చిన్న చిన్న తగాదాలు ముగిసి సర్దుకున్నాయి. సద్దిబండిలో వడల మ్ముకునే బాబుగాడు, చల్లటి ఇడ్లీలు అమ్మే జాన్- ఇద్దరూ రాకపోవడంతో గంగయ్యకు భోజన వైరాగ్యం ముంచుకొచ్చింది. మంచి మధ్యాహ్నమవుతున్నా ఇంత వరకు తనను 'తిన్నావా' అని అడిగిన దిక్కులేదు. రైల్లోంచీ ఎవరెవరో దిగుతున్నారు. ఎప్పుడో చనిపోయిన భార్య రాదు. దూరప్రాంతంలో ఉన్న కొడుకు, కోడలు రారు. ఏమి బతుకో- ఏం ఉద్యోగమో, ఇంత బదుకూ, ఇంత సంపాదనా అంతా పట్టెడన్నం కోసమే గదా! ఒక దినం మద్దానం దాకా నాష్టా తిననందుకు ఏఎస్ఎమ్ ఏడుపు పాట పాడతా ఉండాడు. తనకు తినే తిండికి దినామూ అగసాట్లే గదా!

గంగయ్య గబగబ ముందుకు నడిచి రత్నమ్మ చేతిలో పది రూపాయిలుంచి సందేళ వచ్చేటప్పుడు ఒక బిర్యానీ పొట్లం తెమ్మని పురమాయించాడు. తనను చూడగానే తప్పించుకుని పారిపోతున్న నూరుల్లాను పట్టుకుని వాడి గంపలో నుంచీ సెనగలు, బటానీలు తీసి నిక్కరు జేబుల్లో పోసుకున్నాడు.

బలంగా కూతవేసి బండి కదిలింది.

పెట్టెల్లోని కట్టెలూ, క్యాన్లూ, మూటలూ అన్నీ సర్దుకున్నాయి. పెట్టెలు తయారైన చెక్కలూ, ఇనప సామాన్లతో బాటు మనుషుల శరీరాలు వేడెక్కు తున్నాయి. ఫైర్‌మన్ కుంపటిలోకి నల్లటి రాక్షసి బొగ్గును కుమ్మరించాడు. అది భగభగ మండుకుని నల్లటి వారి ముఖాలపై ప్రతిఫలించింది. చక్రాలు శ్రామికుల భుజాల రెక్కలలా గుండ్రంగా కదిలాయి. దూరాన్ని పొడుస్తున్నట్టుగా ముందు చక్రానికి ఉన్న పిస్టన్ ముందుకే కదులుతోంది.

ఆరోజూ అమ్మిన ఒకే ఒక టికెట్టు కొన్నవాడు రాగిమానుపెంట చెంగులయ్య. దక్షిణామూర్తి బుకింగ్ ఆఫీస్ తాళం వేసుకుని క్వార్టర్సు కెళ్లిపోయాడు. గంగయ్య సెనగలు దిని చెయ్యి కడుక్కున్నాడు.

సాయంత్రం అయింది. స్టేషను దీపాలు వెలి గాయి. కొళాయి దగ్గర పెరుగుతున్న మల్లెతీగ దగ్గర తడిసిన మట్టివాసనతో కలిసి మల్లెపూల పరిమళం హాయినిచ్చింది. ప్లాట్‌ఫారం మీద గాలి చల్లబడుతోంది. చెట్లలో మబ్బులు అలుముకున్నాయి. సంజెవేళ పిట్టల కలకలం పెద్దదయింది. అడవికి వెళ్లి వస్తున్న మేకలు అక్కడక్కడ రైలు పట్టాలు దాటుతున్నాయి.

సరిగ్గా అలాంటి సాయంత్రమే ఒకనాడు - దాదాపు ఏడెనిమిది సంవత్సరాల క్రితం రైలు దిగాడు అరుణాచలం. చాలా తక్కువగా మాట్లాడడం వల్ల అతణ్ణి గురించిన పూర్తి వివరాలు తెలియవు. అతడి స్వస్థలం పల్లిపట్టు దగ్గర పొదటూరు అంటారు. వాలాజా దగ్గర మరో ఊరంటారు. వచ్చిన మొదట్లో అతడు తరచూ ఆరోగ్యంగానే ఉండేవాడు. స్టేషనులో స్థానం సంపాదించడానికి అప్పుడే అతడు గంగయ్యతో దీర్ఘకాలిక పోరాటం చేయవలసి వచ్చింది.

అరుణాచలం మొదట్లో కొన్ని రోజులు చెని క్కాయల వ్యాపారం, రేగిపండ్ల అమ్మకం లాంటి చిన్న చిన్న మారుబేరాలు సాగించాడు. ఆ తర్వాత కట్టెల వాళ్లతో కలిసి, టౌనుకు కట్టెల్ని వేసుకెళ్లడం నేర్చు కున్నాడు. రోజూ వెయిటింగు రూములో తన అనుమతి లేకుండా శయనిస్తుండడం వల్ల గంగయ్య నుంచి అతడికి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. దాంతో అరుణా చలం తన నివాసాన్ని ప్లాట్‌ఫారం చివరనున్న రేకుల షెడ్డులోకి మార్చాడు. చివరకు నెలకు ఇంత అద్దె చెల్లించే షరతు మీద అక్కడతనికి గంగయ్య వద్ద నుంచి అనుమతి లభించింది. అయితే పంపు షెడ్డుకు కావలిగా అరుణాచలం ఉండటం వల్ల, అప్పుడప్పుడూ మాయమై తిరిగి వస్తున్నందువల్ల అప్పుడప్పుడు అతనిమీద అను మానాలు కల్గుతుంటాయి. షెడ్డులో నివాసం కోసం గంగయ్య దయాదాక్షిణ్యాల మీద ఆధారపడ్డ అరుణా చలం, గంగయ్య పైన అదుపు సాధించడం కాలక్రమాన జరిగింది.

నాటినుంచీ నేటిదాకా అరుణాచలం వెంట ఒక లెదర్ బ్యాగు మాత్రం ఉంది. అందులో కొన్ని పాత ఇంగ్లీషు టైప్డ్ ఉత్తరాలు మరికొన్ని న్యూస్‌పేపరు కటింగులూ ఉన్నాయి. ఏండ్లు పూండ్లుగా అతడు తింటున్న మందుల ప్రిస్కిప్షన్లూ, మెడికల్ రిపోర్టులు కూడా అందులో ఉన్నాయి. స్వతహాగా చాలా మితభాషి అయిన అరుణాచలం ఎవరైనా తన ఆరోగ్యం గురించి వాకబు చేసినప్పుడు మాత్రం లేని ఓపికను తెచ్చుకుని మాట్లాడేవాడు. తనకున్న వ్యాధి లక్షణాలను, వాటి గుర్తింపును, వాటివల్ల తను పడుతున్న బాధలను, పొందిన వైద్య వివరాలకు ఏకరువు పెట్టడంలో అతనికి మానసికంగా కొంత వ్యాధి నయమవుతున్నట్టుండేది.

"నేను గట్టి అన్నం తిని రెండు సమ్మత్సరాలైంది. అట్ల తింటే కూడా ఒక లోతుబొవ్వాని నిండుకూ మజ్జి గన్నం నున్నగా కలుపుకొని ఒక గంట కూసోని తాగా ల్సిందే. అయితే నాకు గంట కొకసారి టీనీళ్లు తాక్కపోతే కడుపులో అగ్గిమాదిరి మంట పుడ్తాది. టేసన్లో మామూ లుగా టీ అమ్మే కాదర్‌బాషా కాడ నాకు పర్మనెంటు అకవుంటు ఉండాది. నెలకువాని లెక్కే నాకు డబ్బై రూపాయిలు అవతాది. ఒక్కో దినం వాడు రాకపోతే నాకు అగసాట్లే. రైలు రోడ్డు దాటి, బ్రిడ్జిదాటి చెక్ పోస్టు కాడికి పొయ్యి టీ తాగి వచ్చేటాళకు నాకు దేవుడు కన్పిస్తాడు. ఏళకు ఆ నీళ్లు కడుపులో బడకపోతే నా బాధ పరమాత్ముడి కెరుక. కాళ్లు ,సేతులు సచ్చుకబోతాయి. అసలు నా కడుపులో అన్నం పొయ్యే పేగు సన్నగా ఒక ఎంటిక పెమాణంలో ఉండాదంట. దాన్ని పెద్దది జేస్తే గానీ నాకు సరిగ్గా తిండి దిగదంట. ఈ వ్యాది కోసం నేను తిరగని ఆస్పత్రి లేదు. సూడని డాక్టరు లేదు. మద్రాసు జెనరలాస్పత్రిలో రెండు నెల్లుంటి. ఆడుండే డాక్టర్లు క్యూలో నిల్సుకోని ఇరవై దినాలు జూసి, ఇరవై ఒకటో రోజు డిస్చార్జి చేసేసిరి. మళ్ల అక్కడ ఓపిలోనే నెలనాళ్లుంటి. నేను ఇంగ్లీషులో చెవరాలు జేసేది జూసి డాక్టరమ్మలే యిచిత్రపొయ్యిరి. మళ్లొక సమ్మత్సరం వొళ్లు సుమారుగా ఉండె. పోయిన్నెల తిరుపతి రొయ్యా సుపత్రిలో పది దినాలుంటి. ఏమైనా మద్రాసు పెద్దాసు పత్రి తర్వాతే ఇది. అయినా ఈ దినాల్లో మనిషి దుడ్డు జూసి వైద్యం జేసేవారేగాని- మనిషి రోగం జూసి వైద్యం జేసేవో దెవుడు? ఇదంతా కాదనీ వేలూరు సిఎమ్‌సీకి పోదా మనుకుంటా ఉండా! దాన్ని మించిన ఆస్పత్రి వోల్ ఇండియాలో లేదంట. దానిగ్గాను నా దగ్గిరి వెయ్యి రూపాయిలుండాయి. యింగొక యిన్నూరు కావాల. దొరికితే బండెక్కేస్తాను."

నిజానికి అరుణాచలం అలా అప్పుడప్పుడు స్టేషన్నుంచీ మాయం కావడం రివాజే. తిరిగి వచ్చాక షెడ్డులో తన వాచ్‌మేన్ గిరీ వల్ల ఉండే ఉపయోగాన్ని నిరూపించుకోడానికి మొట్టమొదట్లో కష్టమవుతూ ఉండేది. అయితే ఒకసారి స్టేషన్లో ఇనస్పెక్షను జరుగు తుండగా వచ్చిన హిందీ పెద్దమనిషితో- అరుణాచలం తన ఆపదను కాపాడుకోడానికి ఇంగ్లీషులో మాట్లాడం జూసి అప్పటి ఎఎస్ఎమ్ రామమూర్తితో బాటూ వచ్చిన ఆఫీసరు కూడా డంగైపోయాడు. ఆ తర్వాత గంగయ్య ఎప్పుడైనా తనతో తగవు పెట్టుకుంటే, అతడు చేసే పనులమీద ఇంగ్లీషులో తానొక ఫిర్యాదు రాసి జంక్షను లో ఉన్న ఆఫీసర్లకు పంపిచ్చేస్తానని అరుణాచలం తిరగ బడ్డాడు. దాంతో పులిలాంటి గంగయ్య అరుణాచలం దగ్గర పిల్లిలా మారిపోయాడు. అరుణాచలం లెదర్ బ్యాగులో దాచుకున్న టైపు కాగితాల్ను చూసినప్పుడు గంగయ్య వెన్నులో సన్నగా జ్వరం మొదలవడం కద్దు.

దగ్గు పొరల మధ్య అరుణాచలం తన రోగ వైభవాన్ని రంజుగా చెప్పే సందర్భాలలో తప్పించి- అతడి కళ్లలో వెలుగు కన్పించడం క్రమంగా తగ్గిపోయింది గత రెండు నెలలుగా రాయవెల్లూరు పోవడానికి సిద్ధమవుతున్నాడు అరుణాచలం. నిజానికి అతని వద్ద ఎంత డబ్బు పోగయిందో కానీ, రెండు వందలు అప్పు ఇవ్వవలసిందిగా అతడు గంగయ్యను అనుదినం సతాయిస్తున్నాడు. చివరకు తన చివరి అస్త్రమైన కంప్లయింటు పేపర్లను కూడా మొన్నీమధ్య ఒకరోజు గంగయ్యకు చూపించేశాడు. అతడి ఆరోగ్యం రోజు రోజుకు క్షీణిస్తున్నది. చాలనిదానికి స్టేషన్లో ఈమధ్య టీ కూడా దొరకడంలేదు. అరుణాచలం ఏమి తాగి బతుకుతున్నాడో ఎవరికీ పట్టింది కాదు.

దిక్కూ మొక్కూలేని జనం కొందరు మళ్లీ ఆ సాయంత్రం స్టేషన్లో పోగయ్యారు. ఫోన్లు మోగాయి. సిగ్నల్సు వొంగాయి. ఎక్కడో రైలు కూత విన్పించింది. కొన్ని నిముషాల్లో ప్యాసింజరు ప్లాట్‌ఫారంలో ఆగింది.

రైలు ఆగుతూనే దక్షిణామూర్తి జెండా ఊపడం కూడా మరచి చెంగులయ్య దింపిన మూటను అందుకొన్నాడు. రైలు పెట్టెల నుంచి పడుతున్న వెలుతురులో అతడి ముఖం తేటగా వెలిగింది. కట్టెలవాళ్లు దిగుతూనే ప్లాట్‌ఫారంపైన కలకలం పెద్దయింది. టవున్లో బండిని స్క్వాడు అటకాయించింది. కట్టెల్ని స్వాధీనం చేసుకుని హోటళ్ల వారికి చవగ్గా వేలం వేసేశారు. కట్టెలవాళ్లు రాత్రికి పస్తు పడుకోవలసి వస్తున్నందుకు వగస్తున్నారు. వాళ్లు కొట్టిన కట్టెలు ఈ పాటికి హోటళ్లలో డబ్బిచ్చి కొనగలిగినవారు తినబోయే వంటకాలను వేడి జేస్తూ ఉంటాయి. చెంగులయ్య బ్లాక్‌లో దొరికిన అయిదు లీటర్ల అయిలుతో పది లీటర్ల క్యాను తొణుకుతుండగా ఇంటిముఖం పట్టాడు. సగం పంట అయినా కాపాడగలననే నమ్మకం పోవడంతో అతడు మధ్యాహ్నం అంతంత మాత్రంగా తిన్న తన అర్ధాకలిని కూడా మరచిపోయాడు.

కట్టెలు పోయిన బాధతో రత్నమ్మ బిర్యానీ పొట్లం తేవడం కావాలనే మానేసింది. తమకు తాగను సద్దినీళ్లకు గతి లేకుండా ఉంటే- నెలనెలా తమను దోచి టీసీలకు పెడుతున్న గంగయ్య బిర్యానీ తినడాన్ని ఆమె సహించలేకపోయింది. గంగయ్య బాబుగాడి దగ్గర్నుండీ నాలుగయిదు వడలు లాక్కుని తినడంలో మునిగిపోయి రత్నమ్మ తిరస్కారాన్ని గుర్తించలేదు. బండి సాగిపోయిన తర్వాత నిశ్శబ్దం అలుముకుంది.

ఎన్నడూ లేనిది ఆరాత్రి ఏడు గంటలకు ప్లాట్‌ఫారం మీద కొంత జన సంచలనం కన్పించింది. స్టేషనుకు కొద్ది దూరంలో పట్టాల దగ్గర ఒక శవం కన్పించింది. ఆ అనాథ శవం అరుణాచలమని గుర్తించడానికి అట్టేసేపు పట్టలేదు.

రైలు కిందపడ్డ గాయాల జాడలేమీ లేనందువల్ల ఎలా చనిపోయాడన్నది తీవ్ర చర్చనీయాంశమైంది. చివరిపెట్టె కొట్టిందన్నారు కొందరు. లోగాయాలు ఉండవచ్చునన్నారు కొందరు. యాక్సిడెంట్ గనుక అయితే సమీపంలోని రైల్వే పోలీసు వారికి తెలియజేయాల్సి వస్తుందన్నారు కొందరు. చీకట్లో పురుగు ఏదైనా ముట్టుకుని ఉండవచ్చునని మరికొందరు తలపోశారు. పోలీసు కేసయితే ఇంటరాగేషన్‌లో అరుణాచలం చట్ట వ్యతిరేక సిలెండరు రవాణాలో గంగయ్యకు, దక్షిణామూర్తికి గల ప్రమేయం బట్టబయలయితే ఇద్దరికీ డేంజరని ఇంకొందరు సూచించారు.

ఫలితంగా ఆలస్యం గాకుండా స్టేషనుకు అనతి దూరంలో అరుణాచలం భౌతికకాయానికి అంత్యక్రియలు జరిగాయి. అతడి కట్టె కట్టెల్లో మండి బూడిద అయిపోయింది. చావు కబురు తెలిసేటప్పటికే దక్షిణామూర్తి భోంచేసి ఉన్నాడు. పగలంతా బలవంతపు ఉపవాసం ఉండిన గంగయ్యకు రాత్రి పన్నెండు గంటల దాకా జాగరణా తప్పలేదు.

రాత్రి పన్నెండు గంటలకు నిద్రపట్టని దక్షిణామూర్తి గంగయ్య క్వార్టర్సు వైపుకి నడిచివొచ్చాడు. ఆ వేళకు రత్నమ్మ గంగయ్య ఇంటిముందు పొయ్యి రాజేసి ఎసరు బెడుతూ ఉన్నది.

స్టేషను స్టేషనంతా తన చెప్పుచేతల్లో నడిపిస్తున్నాడని అగుడుపడ్డ గంగయ్య నులకమంచం మీద పడుకుని హృదయ విదారకంగా విలపిస్తున్నాడు. అగుడుపడ్డ గంగయ్యను కూడా అదుపులో ఉంచిన అరుణాచలం పిడికెడు బూడిద అయ్యాడు. ఇంతకీ మానవ జీవితంపై అధికారం ఎవరిదనే ఆలోచనలో పడ్డాడు దక్షిణామూర్తి.

పొయ్యి భగభగ మండుతోంది. అన్నం కుతకుత ఉడుకుతోంది. ఏదో గూడ్సు బండి స్టేషన్లో ఆగకుండానే వెళ్లిపోయింది.

*ఆంధ్రప్రభ వారపత్రిక, 18-24 ఆగస్ట్ 1993*